## ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**-రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**కోహెడ, మార్చి 9, ప్రభాతవార్త:**

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన, ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతోపాటు గ్రామాలలోని సమస్యలన్నీ పరిష్కరించుకోవాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హైమావతితో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వేసవిలో గ్రామాలలో త్రాగునీటి కొరత ఉండకుండా చూసుకోవాలని, ఇందుకు ముందస్తు ఏర్పాటు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఈకార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని, గ్రామాలకు సేవచేయాలని వచ్చిన నూతన సర్పంచులు, ప్రజాప్రతినిధులకు ఇది ఒక చక్కని అవకాశం అన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు ఉన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## మే 10వ తేదీ లోపు అన్ని పంటల నమోదుకు చివరి తేదీ

**-జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**

**కొల్చారం, మార్చి 9, ప్రభాతవార్త:**

కొల్చారం మండల పరిధిలోని అప్పాజీపల్లిలో సోమవారం పంటనమోదు యాప్ పనితీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ పంటల నమోదుకు వ్యవసాయశాఖ గ్రామస్థాయిలో ప్రైవేట్ సర్వేయర్ల ద్వారా డిజిటల్ పంట సర్వేకి శ్రీకారం చుట్టింది. జియోరిఫరెన్స్ చేయబడిన కాడాస్ట్రల్ మ్యాప్లు వున్న గ్రామాలలో ప్రైవేట్ సర్వేయర్లు కేంద్ర ప్రభుత్వం యాప్‌లో పంట నమోదుచేస్తారు. కాడాస్ట్రల్ మ్యాప్ అందుబాటులో లేని గ్రామాలలో మండల వ్యవసాయ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ యాప్‌లో పంట నమోదుచేస్తారని అన్నారు. పంట నమోదు వివరాలను మొబైల్ యాప్ ద్వారా పక్కాగా నమోదు చేయాలని సూచించారు. జియోట్యాగింగ్ ద్వారా ఆ సర్వే నంబరు పొలం నుంచే అప్లోడ్ చేశారా? లేదా అనేది వ్యవసాయశాఖ గుర్తిస్తుందని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 39827 ఎకరాలు నమోదుచేసినట్లు తెలిపారు.

## క్షేత్రస్థాయిలో జిల్లా అధికారులు పర్యటించాలి

**-షెడ్యూల్ ప్రకారం జిల్లావ్యాప్తంగా చురుగ్గా నిర్వహించాలి**

**-కలెక్టర్ హైమావతి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జిల్లావ్యాప్తంగా 99రోజులు చురుగ్గా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఆమె అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ శాఖలవారీగా నిర్దేశించిన కార్యక్రమాలను ప్రతిరోజు జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నిర్వహించిన ఆయా కార్యక్రమాల వివరాలను ఫోటోలతో సహా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ఈనెల 6నుంచి 15వరకు నిర్వహిస్తున్న పరిశుభ్రత, ఫైళ్ళ పరిష్కారం కార్యక్రమాన్ని అన్నిశాఖలలో నిర్వహించి కార్యాలయాలను శుభ్రంగా చేయడంతోపాటు పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలన్నారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వాహనాల డ్రైవర్లకు వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందించేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకోవాలన్నారు. 14 నుంచి 15 యేళ్లలోపు పిల్లలకు జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని సిహెచ్‌సి, పిహెచ్‌సిల్లో హెచ్‌విపి వ్యాక్సినేషన్ చేయించాలన్నారు. 12న మున్సిపల్ కమిషనర్లు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొండపోచమ్మ కాలువ పనులు పూర్తిచేయాలి



కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు దరకాస్థును అంధిస్థున్న కామారం రైతులు

**చిన్నశంకరంపేట, మార్చి 9, ప్రభాతవార్త:**

కొండపోచమ్మ కాలువ నిర్మాణం పూర్తి అయితే పంటపొలాలకు నీళ్ల వస్తాయని ఆశపడిన తమకు నిరాశే మిగిలిందని చిన్నశంకరంపేట మండలం కామారం రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతప్రభుత్వం కొండపోచమ్మ కాలువ నిర్మాణానికి సాగుభూమి 40ఎకరాలను అందించామన్నారు. గ్రామ శివారు వరకు 90శాతం పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనులను పూర్తిచేసి రైతులకు నీళ్ల అందించాలని గ్రామస్థులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు దరకాస్తుచేశారు. కొండపోచమ్మ కాలువ నిర్మాణం పూర్తి అయితే లక్షల ఎకరాల పంట భూమికి నీళ్ల అందుతాయని, రైతులకు నీళ్ల కష్టాలు పోతాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

## అబాకస్ జాతీయస్థాయి పోటీలో రెండోస్థానంలో నిలిచిన సిద్దిపేట విద్యార్థిని



జాతీయ స్థాయిలో రెండో బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

**సిద్దిపేట అర్బన్, మార్చి 9, ప్రభాతవార్త:**

హైదారాబాద్‌లో నిర్వహించిన అబాకాస్ జాతీయస్థాయి పోటీలో సిద్దిపేట పట్టణంలోని విద్యవర్ధిని పాఠశాలలో ఫస్ట్‌క్లాస్ చదువుతున్న విద్యార్థిని జి.సాన్విక రెండోస్థానంలో నిలిచి బహుమతి అందుకున్నది. స్టార్ జూనియర్ లెవల్-1లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి 2025-26 జాతీయస్థాయి పోటీలలో రెండోస్థానంలో నిలిచి నగదు బహుమతి అందుకున్నారు. ఈసందర్భంగా స్కూల్ యాజమాన్యం, హెచ్‌ఎం బి.మోహన కుమార్, శిక్షకులు శామీమ్, భార్గవిలు సాన్వికను అభినందించారు.

## ఇంటికి దారి ఇప్పించాలని ప్రజావాణిలలో ఫిర్యాదు



ఇంటికి దారి ఇప్పించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**మునిపల్లి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

మునిపల్లి మండలం కంకోలు గ్రామంలో ఆర్అండ్‌బి దారిని కబ్జాచేసి, అక్రమంగా దుకాణాలు నిర్మించారని గ్రామనివాసి సూర్యాపేట సురేష్ సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని తన ప్లాట్ నంబర్ 784 వద్ద ఇల్లు నిర్మించుకోవాలని ప్రయత్నిస్తుండగా, ప్లాట్‌కు వెళ్లడానికి 9ఫీట్ల దారి ఉండడంతో ఆ దారిని కొందరువ్యక్తులు అక్రమంగా ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేశారన్నారు. దీనిపై గతంలో ఎంపిడివోకు ఫిర్యాదుచేయగా, విచారణలో కబ్జాదారులు దారి వదులుతామని అంగీకరించారని, కానీ ఇప్పటికీ ఖాళీ చేయకుండా ఇంటి నిర్మాణానికి ఆటంకం కలిగిస్తున్నారని, ఈవిషయమై తహసీల్దార్ స్పందించి క్షేత్రస్థాయిలో విచారణజరిపి, అక్రమ నిర్మాణాలను తొలగించి తమకు దారి ఇప్పించాలని కోరుతూ, సంబంధితపత్రాలను అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ సూర్యాపేట సురేష్‌కు న్యాయం చేస్తామన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే పథకాలు విజయవంతం

**హుస్నాబాద్ రూరల్, మార్చి 9, ప్రభాతవార్త:**

హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 5కె రన్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ఏ కార్యక్రమమైనా ప్రజల భాగస్వామ్యంలేకుండా విజయవంతం కావడం సాధ్యంకాదన్నారు. ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 99రోజుల కార్యాచరణ ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు మంత్రి, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలిసి కొంతసేపు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ద్విచక్ర వాహనంపై పట్టణంలోని ప్రధానవీధుల్లో తిరుగుతూ మార్నింగ్‌వాకర్స్‌తో మాట్లాడి ప్రణాళిక లక్ష్యాలను వివరించారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ 5కె రన్ నిర్వహించినట్లు తెలిపారు. పట్టణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు. 99రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పది ప్రధాన అంశాలను తీసుకుని ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. గృహాలలో ఉన్న వ్యర్థాలను మున్సిపల్ సిబ్బందికి అందించాలని, ఖాళీస్థలాలలో నీరు నిల్వ ఉండకుండా యజమానులు మట్టిపోసి చదును చేయించాలని సూచించారు. ప్రజలకు ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం 5కె రన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంత్రి బహుమతులు అందజేసి అభినందించారు.

**సర్పంచులు-అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**-త్రాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి: మంత్రి పొన్నం ప్రభాకర్**

హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బిసిసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హైమావతి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా హుస్నాబాద్ మండలస్థాయి అధికారులు, గ్రామపంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు విధానంపై మంత్రి మార్గనిర్దేశం చేశారు. సర్పంచులు, వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి హుస్నాబాద్ మండలాన్ని అగ్రస్థానంలో నిలపాలని సూచించారు.

హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక జివో తీసుకువచ్చినట్లు మంత్రి తెలిపారు. ప్రైవేట్ మెడికల్ కళాశాలలు, సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలల సహకారంతో పిహెచ్‌సిల ద్వారా వైద్యశిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుచేయాలని సూచించారు. ఈసందర్భంగా సాహస్ స్వచ్ఛందసంస్థ హుస్నాబాద్ మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు మంత్రి చేతులమీదుగా ఉచిత మైక్ సెట్లు అందజేసింది. అలాగే పిఎం సూర్య ఘర్ మఫ్త్ బిజిలి యోజన ప్రచారరథాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**250 పడకల ఆసుపత్రి నిర్మాణం పరిశీలన...**

హుస్నాబాద్ పట్టణంలో నిర్మితమవుతున్న 250 పడకల ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను రాష్ట్ర రవాణా, బిసిసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు.

నిర్మాణస్థలాన్ని సందర్శించిన మంత్రి పనుల పురోగతిని సమీక్షిస్తూ అధికారులతో మాట్లాడారు. ఆసుపత్రిలో భవిష్యత్ అవసరాలను దృష్టిలోపెట్టుకుని అన్నిసౌకర్యాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

**-ప్రమాద బీమా చెక్కును అందజేసిన మంత్రి...**

హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్రరవాణా, బిసిసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా హుస్నాబాద్ పట్టణంలోని గాయత్రిబ్యాంకు ఖాతాదారుడి కుటుంబానికి ప్రమాద బీమా చెక్కును అందజేశారు. హుస్నాబాద్ మండలం కుచనపల్లి గ్రామానికి చెందిన మాతూరి రవి ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందారు. ఆయనకు గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో ఖాతా ఉండగా, బ్యాంకు తరపున అమలులో ఉన్న ప్రమాద బీమా పథకం కింద ఆయన కుటుంబసభ్యులకు రూ.1,00,000 (ఒకలక్ష రూపాయలు) విలువైన చెక్కును మంత్రి అందజేశారు. ఈసందర్భంగా మంత్రి బాధిత కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, అధికారులు వేణు, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**-ప్లాస్టిక్ తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలి**

**-రవాణా, బిసిసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**




మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**-సిద్ధిపేట కలెక్టర్ హైమావతి**



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించడానికి సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణికి వచ్చి అందజేసిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతలమేరకు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా 169 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్వో నాగరాజమ్మ, ఎఓ రాజ్‌కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పార్శికుంటకు హద్దులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన జంగం రమేష్‌గౌడ్...**

**గజ్వేల్, మార్చి 9, ప్రభాతవార్త:**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లికి చెందిన పార్శికుంటకు హద్దులు ఏర్పాటుచేయాలని కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు జంగం రమేష్‌గౌడ్ సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగం రమేష్‌గౌడ్ మాట్లాడుతూ పార్శికుంట ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని, వెంటనే సరిహద్దులు గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పార్శికుంటకట్టపై నుండి గ్రామానికి వెళ్ళాలంటే ముక్కుమూసుకొని వెళ్ళాల్సి వస్తుందని, పార్శికుంటను సుందరీకరణ చేపట్టి శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ హైమావతి సమస్యపై సానుకూలంగా స్పందించారని, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు.

# ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే బిఆర్‌ఎస్ లక్ష్యం

**-డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

సిద్దిపేటలో ప్రారంభమైన ఇఫ్తార్‌విందులు నేడు దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లాకేంద్రంలోని మెదక్‌రోడ్డులోగల ఎక్బాల్ మినార్ ఈద్గా మైదానంలో సోమవారం సాయంత్రం ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందులో మాజీ హోంశాఖ మంత్రి మహమూద్ అలీతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 35 యేళ్ల క్రితమే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ సిద్దిపేట నియోజకవర్గంలోని చింతమడకలో ఇఫ్తార్ విందును ప్రారంభించారని తెలిపారు. అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా కెసిఆర్ పాలన సాగించారని గుర్తుచేశారు. రాష్ట్రంలోనే హైదారాబాద్ తర్వాత మొట్టమొదటి హజ్‌హౌస్ నిర్మాణం సిద్దిపేటలోనే జరిగిందన్నారు. నిరుపేద ముస్లింలు పండుగను సంతోషంగా జరుపుకోవడానికి ప్రత్యేకంగా రంజాన్ తోఫను అందించినట్లు తెలిపారు. సిద్దిపేటలో గూడులేని ముస్లింలకు 700 డబుల్‌బెడ్‌రూంలు కేటాయించినట్లు గుర్తుచేశారు. మాజీ డిప్యూటీ సిఎం మహమూద్ అలీ, మస్కటి అధినేత అలీలు మాట్లాడారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ శ్రేణులు, ముస్లింపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న హరీష్‌రావు, మహమూద్ అలీ

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**-సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య**

**-ఇస్నాపూర్ జడ్పిహెచ్‌ఎస్ పాఠశాల, డంపింగ్ యార్డ్ ఆకస్మిక తనిఖీ**



ఆకస్మిక తనిఖీ చేస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

**పటాన్‌చెరు, మార్చి 9, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య స్పష్టంచేశారు. సోమవారం ఇస్నాపూర్‌లోని జడ్పి హైస్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన హెడ్‌మాస్టర్‌కు, పర్యవేక్షణ లోపించినందుకు ఎంఈఓపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన షెడ్యూల్ సరిగ్గా అమలు కాకపోవడం, విద్యార్థులకు గుడ్లు అందించకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ సంబంధిత ఏజెన్సీకి నోటీసులు ఇచ్చి వివరణ అడగడంతో పాటు, అవసరమైతే ఏజెన్సీని రద్దుచేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై ఎలాంటి ఒత్తిడి లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఇస్నాపూర్ డంపింగ్ యార్డును పరిశీలించిన కలెక్టర్ అక్కడ చెలరేగిన మంటలను 24 గంటల్లో ఆర్పాలని, నిల్వ ఉన్న వ్యర్థాలను 48 గంటల్లో తొలగించాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుమలత, కమిషనర్ వెంకట కిషన్‌రావు, పటాన్‌చెరు తహసీల్దార్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో బైక్ దొంగల ముఠా గుట్టురట్టు

**-నిందితుని అరెస్ట్, 8 బైకులు స్వాధీనం**



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, నిందితుడిని చూపుతున్న గజ్వేల్ పోలీసులు

**గజ్వేల్, మార్చి 9, ప్రభాతవార్త:**

గజ్వేల్ పట్టణంలో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను గజ్వేల్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుండి 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు గజ్వేల్ ఎసిపి నర్సింలు వెల్లడించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 2వ తేదీరాత్రి గజ్వేల్ పట్టణంలోని బాలాజీ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న పురంశెట్టి ప్రవీణ్‌కుమార్ తన పల్సర్‌బైక్‌ను ఇంటిముందు పార్క్ చేయగా మరుసటి రోజు ఉదయానికి అది కనిపించకపోవడంతో బాధితుడు గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా వెంటనే పోలీసులు స్పందించి విచారణ చేపట్టారు. వర్గల్ మండలం మైలారం గ్రామానికి చెందిన బూర్గుపల్లి స్వామి, బూర్గుపల్లి మల్లేష్‌లను సిసి ఫుటేజీల ద్వారా గుర్తించి పిడిచెడ్ వైపు నుండి ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు పల్సర్‌బైక్‌పై వస్తున్న వీరిని పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. వీరిని విచారించగా పల్సర్ వాహనంతో పాటు వివిధ ప్రాంతాలలో మరో 7 బైక్‌లు దొంగిలించినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. గజ్వేల్ పరిధిలో 3, గౌరారం పిఎస్ పరిధిలో 2, మెదక్ పిఎస్ పరిధిలో 1, నార్సింగి పిఎస్ పరిధిలో 1, చేగుంట పిఎస్ పరిధిలో 1 వాహనాలను దొంగిలించినట్లు నిందితుడు తెలిపినట్లు తెలిపారు. అతితక్కువ సమయంలో కేసును ఛేదించినందుకు గజ్వేల్ ఎస్‌హెచ్‌ఓ రవికుమార్, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు, ఎస్‌ఐ ప్రేమ్‌దీప్, క్రైమ్‌సిబ్బంది వెంకటేష్, రవి, దివ్య, స్వామి, వెంకన్నలను ఎసిపి నర్సింలు ప్రత్యేకంగా అభినందించారు.

## అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

**-ఆకస్మిక తనిఖీలో మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ శృతి ఓజా**




అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులతో శృతి ఓజా

**నర్సాపూర్ రూరల్, మార్చి 9, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ శృతి ఓజా ప్రజా పాలనలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలోని పరిసరాల పరిశుభ్రత కేంద్రంలోని ఆరోగ్యలక్ష్మి భోజనాన్ని తనిఖీచేశారు. అనంతం అంగన్‌వాడీ చిన్నారులచే ముచ్చటించారు. అక్కడికి వచ్చిన తల్లులను స్వయంగా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ గురించి ఎలా ఉంటుంది అని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పరిసరాలు, కేంద్రం లోపల, బయట టాయిలెట్లు ప్రతి ఒక్కటి పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అక్కడ ఉన్న న్యూట్రి గార్డెన్ పరిశీలించి ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కూడా నూట్రి గార్డెన్ ఉండాలని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా సంక్షేమ అధికారి హేమభార్గవి, రెడ్డిపల్లి సర్పంచి పద్మఅశోక్‌గౌడ్, పోషణ అభియాన్ కోఆర్డినేటర్, ఐటి కోఆర్డినేటర్, సూపర్వైజర్లు సంతోషిమాత, సరళకుమారి, అంగన్‌వాడీ టీచర్ హేమలత, ఆయా తదితరులు పాల్గొన్నారు.



హరీష్‌రావును కలిసిన ఎమ్మెల్యే సునీతరెడ్డి, నూతన కౌన్సిలర్‌లు

## హరీష్‌రావును కలిసిన నూతన కౌన్సిలర్లు

**నర్సాపూర్ మార్చి 9, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో నూతనంగా గెలిచిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు సోమవారం ఎమ్మెల్యే సునీతరెడ్డి ఆధ్వర్యం లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావును హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను హరీష్‌రావు శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతరెడ్డి, కౌన్సిలర్లు సునీతబాల్‌రెడ్డి, కండెల రాజు, షేక్ హుస్సేన్, మొహిజుద్దీన్ , నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నహీముద్దీన్, రింగుల ప్రసాద్, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు



బుచ్చేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఇచ్చిన ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

**నర్సాపూర్ మార్చి 9, ప్రభాతవార్త :** మతసామర్స్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళియాదవ్ అన్నారు. నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ వనముల బుచ్చేష్ యాదవ్ ఆధ్వర్యం లో నర్సాపూర్‌లోని షాదీఖానాలో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ పండగ సందర్భంగా నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టి అత్యంత క్రమశిక్షణతో ఉంటారన్నారు. అనంతరం వైస్ చైర్మన్ బుచ్చేష్‌యాదవ్ మాట్లాడుతూ ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీకాంత్ నిరంజన్ దాస్. ముస్లిం మత పెద్దలు. ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిసిసి అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నేతలు



పిసిసి అధ్యక్షుడిని కలిసిన ఆంజనేయులుగౌడ్, సుహాసినిరెడ్డి

**నర్సాపూర్ మార్చి 9, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ ఈనెల చివరి వరకు మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలతో పాటు మండల కమిటీలను ఏర్పాటు చేయాలని పిసిసి అధ్యక్షుడు తనకు సూచించినట్లు ఆంజనేయులు గౌడ్ తెలిపారు.

## 10వ వార్డులో పర్యటించిన మున్సిపల్ కమిషనర్, వైస్‌చైర్మన్

**నర్సాపూర్, మార్చి 9, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో సోమవారం మున్సిపల్ వైస్‌చైర్మన్ బుచ్చేష్‌యాదవ్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డితో కలిసి 10వ వార్డులో పర్యటిం చారు. ఈ సందర్భంగా ఈ వార్డులో నెలకొన్న సమస్యలను 10వ వార్డు కౌన్సిలర్ కండెల రాజును వార్డు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక వార్డులో పర్యటించి మురికి కాలువలను సిసి రోడ్లను వారు పరిశీలించారు. వార్డులోని సమస్యలను తమ దృష్టికి తెచ్చినట్లయితే పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, వార్డు కౌన్సిలర్ కండెల రాజు, మున్సిపల్ సిబ్బంది భోపాల్ వినీత్ రాజ్ జేమ్స్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**నర్సాపూర్ మార్చి 9, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ పరిసరాలను పరి శుభ్రంగా ఉంచుకోవాలని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఆదెప్ప అన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ సూచనల మేరకు డాక్టర్ ఆదెప్పగారి ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మాట్లాడుతూ పరిసర పరిశుభ్రత విలువను తెలియజేస్తూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎన్ఎస్ఎస్2 ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలుర బాలికల మూత్రశాల, కళాశాల చుట్టూ పరిసరాలను పరిశుభ్రం చేశారు త్రాగునీటి పరిసరాలను శుభ్రం చేయుట కళాశాల చుట్టూ పక్కల ఉన్న వ్యర్థ పదార్థాలను పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఆదెప్ప, డాక్టర్ రమేష్, డాక్టర్ రవికుమార్, శ్రీనివాస్, హేమంత్ కుమార్, రాజు రాములు, ప్రభాకర్ నాన్ టీచింగ్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్కావెంజర్లకు సన్మానం

**వెల్దుర్తి, మార్చి 9, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పీఎం జడ్పిహెచ్ ఎస్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సాంబయ్య ఆధ్వర్యం లో పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్లు హలీమా, శకుంతల, రేణుకలను సోమవారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాల శుభ్రత, పరిశుభ్రత కాపాడడంలో మీ పాత్ర ముఖ్యమైనదన్నారు. ఏదైనా సమస్యలు పాఠశాల నిర్వహకులకు తెలియ జేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట స్వామి. శ్రీనివాస్, నరసింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, ధనరాజ్ పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

**వెల్దుర్తి, మార్చి 9, ప్రభాతవార్త :** ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉద యం చండీయాగాన్ని నిర్వహించారు. కాగా టిపిసిసికార్యదర్శి ఆవుల రాజి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ నాయకుడు స్వామి ఆవుల రాజిరెడ్డితో పాటు పలువురు నాయకులను శాలువాలతో సన్మానించారు. సందర్భంగా ఆవుల రాజురెడ్డి మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు బాగుండాలన్నారు. కార్యక్రమం లో నాయకులు నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి. నాయకులు శేఖగౌడ్, మల్లేశం, ముక్తా బాయ్, పోతిరెడ్డి, సుధాకర్‌గౌడ్, సర్పంచ్ సోమప్ప, నాయకులు దుర్గగౌడ్ తదితరులు పాల్గొన్నారు



పెద్దమ్మ తల్లి వార్షికోత్సవంలో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి

# మహాధర్నాను జయప్రదం చేయండి

**మునిపల్లి, ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానా లను నిరసనగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య లను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వ ర్యంలో ఈ నెల 13వ న మునిపల్లి ఎంపీడీవో కార్యాలయం ముందు నిర్వహించే మహాధర్నాను కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు రమేస్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం మునిపల్లి మండలం ఇబ్రహీంపూర్, బుదేరా గ్రామా లలో పర్యటించి ప్రజా సమస్యలతో పాటు ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుని వారి ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కు సవరణలు చేస్తూ కూలీలందరికీ నష్టం కలిగించే విధంగా కొత్తగా వివిజీ ఆర్ఏఎంజి చట్టంను తీసుకు వచ్చిందన్నారు. దీంతో కూలీలకు రోజుకు రెండు సార్లు ఫోటో దిగే విధానం పెట్టడంతో అనేకమందికి ఫోటోలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఐదారు వారాల నుండి పెండింగ్ కూలీలు ఇవ్వలేదని, పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు లేక కూలీలందరూ ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉపాధి కూలీలందరికీ పనిముట్లు పంపిణీ చేయాలని పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం టెంటు సౌకర్యం మెడికల్ సౌకర్యం కల్పించాలన్నారు. కేంద్ర ప్రభు త్వం రోజురోజుకు నిత్యవసర ధరలు పెరుగుతు న్నప్పటికీ ఉపాధి కూలి పెంచకపోవడం దుర్మార్గమ న్నారు. ఇప్పటికైనా ఉపాధి పని సంవత్స రానికి ..200 రోజులు కల్పించాలని కనీస కూలి రోజుకు 800 ఇవ్వాలని పనిముట్లుపంపిణీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం యుద్ధంపేరుతో ప్రజలపై వేస్తున్న బారాలను వెనక్కి తీసుకోవాలని పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. 13న జరిగే మహాధర్నకు ప్రతి గ్రామం నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభు, నర్సింలు, శ్రీశైలం, అంజన్న, మొగులయ్య, కళావతి, శమంత, మల్లమ్మ, లక్ష్మి, మంజుల, మహేష్, శంకరయ్య, నరేష్, రాములు, గోస్దీన్‌కుమార్, నరేష్, ఏసు, స్వప్న, లావణ్య, రాజమణి ఉమారాణి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రమేష్‌గౌడ్

## మహిళా సమైక్య భవనం వేరే చోట నిర్మించండి

**కొల్చారం మార్చి 9 ప్రభాతవార్త :** ఫ్యూచర్ డెవలప్‌మెంట్‌కు ఆలోచన చేస్తూ మహిళా సమైక్య భవనాన్ని వేరేచోట నిర్మించాలని మండలంలోని పైతర గ్రామస్తులు జిల్లా పంచాయతీ అధికారి యాదయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మంజూరైన మహిళా సమైక్య భవన నిర్మాణానికి తాము అడ్డుకాదని, నూతన గ్రామ పంచా యతీ భవన నిర్మాణానికి అనువుగా ఉన్న ఖాళీ స్థలంలో మహిళా సమైక్య భవనం నిర్మించడం ఫ్యూచర్ డెవలప్మెంట్ కు ఇబ్బందికరంగా ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య దృష్టికితీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంటుందని దాంతోపాటు పక్కనే ఉన్న ఖాళీ స్థలంను కలుపుకొని నూతన పంచాయతీ భవనం నిర్మిస్తే బాగుంటుందని తెలిపారు. ఇందుకు సాను కూలంగా స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య కొల్చారం ఎంపీడీవో రఫీకున్నిసా కు ఫోన్ చేసి ఫ్యూచర్ భవన నిర్మాణాల కోసం ఆలోచన చేసి గ్రామసభ ద్వారానే పనులు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. గ్రామసభలు లేకుండా పనులు ఎట్లా చేపడుతారని పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు చూపు తోనే గత ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీ భవనాలు ఇరుకు గదులుగా ఉండకూడదన్న సంకల్పంతో దాదాపు రూ.13 లక్షల వ్యాయంతో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా విశాలంగా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని గ్రామస్థులు గుర్తు చేశారు. అప్పట్లో కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వల్ల పనులు చేపట్ట లేకపోయారని, ప్రస్తుతం ఉన్న పంచాయతీ భవనంలోనే పాలన కొనసాగుతుందని తెలిపారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఇరుకుగా మహిళా సమైక్య భవనం నిర్మించడం సరైనది కాదని, వేరేచోట నిర్మించేందుకు ప్రజాభిప్రాయ సేకరణ చేసి ప్రణాళికలు తయారు. చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కుమ్మరి భూమయ్య, బోయిని అంతయ్య, బట్ట స్వామి, పుట్టి శివ, మరెల్లి ప్రభాకర్, ఆకుల కార్తీకరాజు, మాడబోయిన శేఖర్, సాయికుమార్ పాల్గొన్నారు.

## సిఐటియుతోనే మెరుగైన ఒప్పందాలు సాధ్యం

### రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

**జహీరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** కార్మిక సంక్షేమ, కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు చేయడంలో సిఐటియుకు సిఐటియునే మేటి అని, యాజమాన్యాల మెడలు వంచి కార్మికులకు మేలు చేసేందుకు సిఐటియు ఎప్పుడు ముందుంటుందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సోమవారం మహీంద్రా ట్రాక్టర్ కార్యకర్తల సమావేశానికి చుక్క రాములు ముఖ్య అతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. గతంలో మహీంద్రాలో జిల్లా, రాష్ట్రంలో సిఐటియుకు మాత్రమే భారీ వేతన ఒప్పందాలు చేసి చరిత్ర ఉందని గుర్తు చేశారు. మహీంద్రా ట్రాక్టర్ కార్మికులు సిఐటియును గెలిపించాలని వినత చేశారు. చుక్క రాములు సమక్షంలో ఆయా యూనియన్‌ల కార్మికులు సిఐటియులో చేరగా ఖండువాలు కప్ప స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం, క్లస్టర్ కన్వీనర్ ఎస్ మహిపాల్, యూనియన్ ప్రధాన కార్యదర్శి మహేశ్వర్, నాయకులు గణేష్ వంశీకృష్ణ, ఆయా యూనియర్‌ల నాయకులు నరసయ్య, సిహెచ్ నరేష్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం రక్షణకే ఊరూరా ఉద్యమం

### -సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

**చౌటకూరు, మార్చి 9, ప్రభాతవార్త:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకునేందుకే ఊరూరా ఉద్యమం చేపడతామని, ఉపాధికూలీల పొట్టకొట్టే వీబీజీ రామ్‌జీ పథకాన్ని రద్దుచేయాల్సిందేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సోమవారం మండలపరిధి లోని లింగంపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనులను, కూలీల్లో వస్తున్న సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో నాయకులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రప్రభుత్వం కుంటి సాకులు చూపుతూ నిధుల్లో కోతలు విధిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలుచేయడంలో భాగంగానే ఉపాధిహామీ చట్టాన్ని రద్దుచేసి రాముడి పేరుతో బిల్లు తీసుకువచ్చిందని విమర్శించారు. బ్యాంకులను లూటీ చేసే దొంగలకు లక్షలకోట్లు తాయిలాల రూపంలో చెల్లిస్తున్న కేంద్రప్రభుత్వం కూలీలు చెమటోడ్చి చేస్తున్న పనులకు డబ్బులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో హడావిడిగా బిల్లును ఎందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్, జిల్లా కమిటీ సభ్యులు విద్యా సాగర్, కృష్ణ, నాయకులు కృష్ణ, శ్రీశైలం, సర్పంచి రాజు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధిహామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న చుక్క రాములు

## ఎల్లమ్మ దేవాలయంలో హరీష్‌రావు పూజలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

సిద్దిపేట రేణుక ఎల్లమ్మ దేవాలయం గొప్ప మహిమన్వితం కలిగిన ఆలయ మని మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రం లోని సిరిసిల్ల రోడ్డులోగల శ్రీ మహారేణుక ఎల్లమ్మదేవాలయం స్వర్ణోత్సవ వార్షికోత్సవ ఉత్సవాలలో ఆయన సోమవారం పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించి మాట్లాడారు. అమ్మ దయ ఉంటే అన్నింటా మంచి జరుగుతుం దన్నారు. రూ.6 కోట్లతో ఎసి గౌడ ఫంక్షన్ హాల్ నిర్మించడం జరిగిందన్నారు. వార్షికోత్సవ ఉత్సవాలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆయన వెంట బిఆర్ఎస్ శ్రేణులు, గీత పారిశ్రామిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## 9 నుంచి 24 వరకు జిల్లాలో సిటీ యాక్ట్ అమలు

### సిపి సాధన రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 9 నుంచి 24 వరకు సిటీ పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ సాధన రష్మీ పెరుమాళ్ సోమవారం తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ధర్నాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. బందల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతం గా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి బెదిరింపులకు గురి చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. అలాగే కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. నిబంధలను ఉల్లంఘించి డిజె వినియోగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ప్రభుత్వ అనుమతులున్న ఎరువులనే విక్రయించాలి

### తహసీల్దార్ మాలతి

**చిన్నశంకరంపేట, మార్చి 9, ప్రభాతవార్త:** ప్రభుత్వ అనుమతులున్న ఎరువుల, క్రిమిసంహారక మందులను మాత్రమే రైతులకు విక్రయించాలని నిర్వాహకులకు తహసీల్దార్ మాలతి సూచించారు. సోమవారం చిన్నశంకరం పేట మండలం గవ్వలపల్లిలోని ఏరువుల దుకాణాన్ని ఏవో లక్ష్మీ ప్రవీణ్‌తో కలిసి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, యాప్ ద్వారా బుక్ చేసుకొని యూరియాను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

## రసమయి ఊక దంపుడు ముచ్చట్లు మానుకో

### కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక

**బెజ్జంకి, మార్చి 9, ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఊక దంపుడు ముచ్చట్లు మానుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ ఎంపిపి ఒగ్గు దామోదర్ హెచ్చరించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రసమయి చేసిన వ్యాఖ్యాలను కాంగ్రెస్ పార్టీ పక్షన తీవ్రంగా ఖండి స్తు న్నామన్నారు. బాలకిషన్ వ్యాఖ్యలు దొంగతనం చేసిన వ్యక్తులే దొంగ, దొంగ అన్నట్లుగా ఉందని మండిపడ్డారు. మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీకి సంబంధించిన అనుమతులు ఇచ్చింది సర్కార్ కాదా అని ప్రశ్నించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ఏనాడు ప్రజల సమస్యలు పట్టించుకోకుండా అధికారాన్ని అడ్డుపెట్టుకొని మోసం చేసిన ఘనత ఆయనకే దక్కుతుంద న్నారు. కాంగ్రెస్ సర్కారు పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుంద న్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ మాట్లాడుతూ రస మయి అధికార పార్టీలో రెండు మార్లు ఎమ్మెల్యేగా ఉండి మండల ప్రజలకు ఒరగబెట్టిందేమిలేదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియోజకవర్గ అభివృద్ధితో పాటు బెజ్జంకి మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుంటే జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు,వార్డు సభ్యులు, ఆలయ కమిటీ డైరెక్టర్లు అక్కరవేణి పోచయ్య, బోనగం రమేష్, ఎలిగే సతీష్,గుబిరే చంద్రం, దోనే శ్యామ్,రావుల నర్సయ్య, ఐలేని శ్రీనివాస్‌రెడ్డి, బోనాల మల్లేశం, నర్సింగరావు, పుర్మ నారాయణరెడ్డి, కత్తి రమేష్, బండి వేణు, బోనగం శంకర్, గుండని ఎల్లయ్య, సంఘ రమేష్, గుబిరే కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

# గీతంకు వన మహోత్సవ అవార్డు

**పటాన్‌చెరు, మార్చి 9, ప్రభాతవార్త**

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గత ఏడాది (2025లో) చేపట్టిన పర్యావరణ స్థిర త్వం, హరిత కార్యక్రమాల నిరంతర నిబద్ధతకు గుర్తింపుగా వన మహోత్సవ అవార్డు – 2026తో సత్కరించారు. హైదరాబాదులో జరిగిన కాన్ఫడరే షన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ 202526 వార్షిక సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖల మంత్రి జి.వివేక్ వెంకట స్వామి చేతుల మీదుగా గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ ఈ అవార్డును అందు కున్నారు. పెద్దయెత్తున మొక్కలు పెంచడం, ప్రాంగణంలో పర్యావరణ హిత అవగాహనా కార్య క్రమాలను నిర్వహించి, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తున్న సంస్థలకు ఈ అవార్డును ప్రదానం చేస్తారు. గీతం హైదరాబాదు ప్రాంగణం నిరంతరం మొక్కల పెంపకం, పర్యావరణ అవగాహనా సద స్సులు, సమాజాభివృద్ధి కార్యక్రమాలను చేపడు తోంది. తద్వారా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ లో చురుకుగా పాల్గొనడానికి, ప్రాంగణంలో ఆ సంస్కృతిని నిరంతరం కొనసాగించేలా ప్రోత్సహి స్తోంది. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డిఎస్.రావు, వివిధ స్కూళ్ల డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, పలు విభాగాల అధిపతులు తదిత రులు ప్రతిష్టాత్మక వన మహోత్సవ అవార్డును అందుకున్నందుకు హర్షం వెలిబుచ్చారు. పర్యా వరణ బాధ్యత, స్థిరమైన అభివృద్ధికి విశ్వవిద్యా లయం యొక్క నిరంతర నిబద్ధతకు గుర్తింపుగా వారు అభివర్ణించారు.




మంత్రి వివేక్ చేతుల మీదుగా అందుకున్న గీతం డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ



మహిళ సమైక్య భవనానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

## అనంతసాగర్, సైదాపూర్ గ్రామాల్లో

## మహిళా సమైఖ్య భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

**కొండాపూర్ మార్చి 9 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో సోమవారం మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఎంజీ ఎన్ఆర్ఇజిఎస్ నిధుల కింద రూ.10.00 లక్షల వ్యయంతో మహిళా సమాఖ్య భవనం, అలాగే రూ.20.00 లక్షల వ్యయంతో కల్వర్ట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అదేవిధంగా సైదా పూర్ గ్రామంలో కూడా రూ.10.00 లక్షల వ్యయంతో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ భవనాల నిర్మాణం ద్వారా మహిళా సంఘాల కార్యకలాపాలకు మరింత సౌకర్యం కలుగుతుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మాజీ ఎంపీటీసీ శ్రీ నర్సింహా రెడ్డి, ఎంపీడీవో వేణుగోపాల్, ఏపీఎం మాణిక్యం, ఏఈ పీఆర్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు నర్సింలు, రాధిక, పంచాయతీ కార్యద ర్శులు గీత, ఇందిర, సంపత్ కుమార్, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

**బద్రిగూడెంలో...**



బద్రిగూడెంలో భవన నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న దృశ్యం

**చౌటకూరు, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బద్రిగూడెంలో 22 లక్షల రూపాయలతో నిర్మించనున్న అంగన్‌వాడి, మహిళా సమైఖ్య భవనాల నిర్మాణాలకు సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నత్తి దశరత్, మాజీ ఎంపిపి అధ్యక్షులు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, జోగిపేట డివిజన్ ఆత్మ కమిటి చైర్మన్ మల్లారెడ్డిలు భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడి భవన నిర్మాణానికి 12 లక్షలు, మహిళా సమైఖ్య భవన నిర్మాణానికి 12 లక్షల రూపాయలు మంజూరు అయినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరు భాస్కర్, ఉప సర్పంచ్ పాల చంద్రయ్య, నాయకులు కలాలి ఈశ్వర్‌గౌడ్, గుండన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, చంటి రమేష్, ప్రభాకర్‌రెడ్డి, కుమ్మరి సాయిలు, హరిసింగ్, వార్డు సభ్యులు అనిత, సంతోష్, మురళీ, శ్రవణ్‌కుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ డ్రైవింగ్ చేసిన యువకులకు కౌన్సిలింగ్




యువకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ రవికుమార్

**గజ్వేల్, మార్చి 9 (ప్రభాతవార్త):** పట్టణంలోని సంగాపూర్ రోడ్డులో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనాలపై రాష్ డ్రైవింగ్ చేస్తూ సోషల్ మీడియాలో హల్‌చల్‌కావడంతో గజ్వేల్ సిఐ రవికుమార్ పోలీస్ బృందం తో వెళ్లి రాష్ డ్రైవింగ్ చేస్తూ వీడియోలు తీసిన యువకులను అదుపులోకి తీసుకున్నారు. యువకులు వాహనాన్ని విచ్చలవిడిగా నడుపుతూ వివిధ భంగిమలలో ద్విచక్ర వాహనాలను తింపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో విషయం తెలుసుకొని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సిఐ రవికుమార్ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిం చాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయా ణించే వారు సీటుబెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మైనర్లు వాహనాలు నడుపుతూ దొరికితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాన్ని రాష్‌గా నడిపిస్తూ ఇతరులకు ఇబ్బంది పెట్టే విధంగా చేసిన యువకులను అదుపు లోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చి వదిలిపెట్టారు.

## గంగోజిపేటలో ఇఫ్తార్ విందు



గంగోజిపేటలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

**చౌటకూరు, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గంగోజిపేటలో ఇమ్మయ్య ఆధ్వర్యంలో సోమవారం రంజాన్ మాసాన్ని పురష్కరించుకుని ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముస్లింలకు ఇమ్మయ్య శుభాకాంక్షలు తెలిని నోటిని తీపి చేశారు. కార్యక్రమంలో నాయకులు హనీఫ్, మన్సూర్, హైమద్, గౌస్, యూనుస్, ఫకీర్, మౌలానా, అబ్దుల్, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**పుల్‌కల్, మార్చి 9, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన పుల్‌కల్‌లో బస్టాండ్ వద్ద సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు క్రమశిక్షణతో విద్యను అందుకుని ఉన్నతు లుగా ఎదగాలని సూచించారు. చట్టాలు, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని ఎస్ఐ వెంకటేశం సూచించారు.



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశం


వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## అక్రమ నిర్మాణాదారులపై చర్యలు తీసుకోవాలి

**బెజ్జంకి, మార్చి 9, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ నిబంధనలు ఉల్లంఘిస్తూ రోడ్లను ఆనుకొని సెట్ బ్యాక్, పార్కింగ్ స్థలం లేకుండాచేసిన నిర్మాణాలను, చేపట్టిన నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అఖిలభారత యువజన సమాఖ్య మండలకార్యదర్శి దొంతర వేణి మహేష్ ఆధ్వర్యంలో సోమవారం సర్పంచ్, ఉప సర్పంచ్,గ్రామ కార్యదర్శులకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. బెజ్జంకి అంబేద్కర్ సర్కిల్ నుంచి గుండారం, కల్లేపల్లి, బెజ్జంకి క్రాసింగ్ వెళ్లే రహదారికి అనుకొని గ్రామ పంచాయతీ నిబంధనలకు విరుద్దంగా అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు.అక్రమ నిర్మాణాలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహన దారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. దుకాణ దారుల సూచిక బోర్డులు నడి రోడ్డుపై పెట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామపంచాయతీ నిబంధనలకు విరుద్దంగా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు రొడ్డ చరణ్, అంతటి సురేష్, తిరుపతి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే రద్దు చేయాలి

### సిపిఎం మండల కార్యదర్శి శ్రీనివాస్

**బెజ్జంకి, మార్చి 9, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుగ్గిళ్ల,పోతారం గ్రామ శివారులలో ఏర్పాటు చేసిన ఇథనాల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని వెంటనే ఫ్యాక్టరీని రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ హైమావతికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీ యజమానులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న పట్టించుకునే నాథుడు లేడన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దుచేసి ప్రజల ప్రాణాలు కాపాడాలన్నారు. ఫ్యాక్టరీ మూలంగా భూసారం,గాలి,నీరు కాలుష్యం అవుతుందన్నారు. భవిష్యత్‌లో పెద్దయెత్తున ప్రాణ నష్టం జరిగే పరిస్థితులు నెలకొన్నాయని వెంటనే ఫ్యాక్టరీని రద్దు చేయాలన్నారు. ఫ్యాక్టరీ నుంచి వెదజల్లే వ్యర్థాలు, దుర్వాసనతో ఊపిరాడక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఫ్యాక్టరీని రద్దు చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బొమ్మిడి సాయికృష్ణ. సంఘ ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

## మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా చాటిన బెజ్జంకి విద్యార్థులు


కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు

**బెజ్జంకి, మార్చి 9, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీవిద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు హైదారాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కికర్స్ మార్షల్ ఆర్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తృతీయ నేషనల్-మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్-2026లో అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. పోటీలలో ఎస్.సాయి,ఎం.లోకేష్,సాయి, హర్షిత్,అక్షిత బంగారు పతకాలు సాధించగా కె.లోకేష్,మహాఅర్జున్ రజత పథకాలు,శ్రీధన్, వైష్విక్‌రెడ్డి,వరుణ్ సందేశ్ కాంస్య పతకాలు సాధించి సత్తాచాటారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. కరాటే మాస్టర్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కరస్పాండెంట్ బొనాల పద్మ, ప్రిన్సిపల్ నీరజలు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ప్రభుత్వం


మాట్లాడుతున్న సర్పంచ్ పత్తి నర్సింలుయాదవ్

**మర్కుక్, మార్చి 9 (ప్రభాతవార్త):** పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా నెరవేరుస్తుందని సర్పంచ్ పత్తి నర్సింలుయాదవ్ అన్నారు. మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో పిట్టల భాస్కర్, పబ్బాల మనిషా రాజులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా నిర్మాణం పూర్తయిన సందర్భంగా సోమవారం గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ పత్తి నర్సింలుయాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దేవి విజయ రమేష్, వార్డు సభ్యులు రాజు, రమేష్, సంజీవ, ప్రభు, వనం శ్రీశైలం, భానుచందర్, కాంగ్రెస్ నాయకులు నక్క రమేష్, రాజబోయిన ఐలేని, ఆనంద్, పరమేష్, బాలరాజు, అశోక్, నర్సింలు, బాలనర్సింలు, రాజు, బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## గొల్ల నరేష్‌కు ఉత్తమ జర్నలిస్టు అవార్డు

**మునిపల్లి, ఫిబ్రవరి 9(ప్రభాతవార్త):** మునిపల్లి మండలం మల్లిలఖార్జున పల్లికి చెందిన గొల్ల నరేష్‌కు ఉత్తమ జర్నలిస్టు ఆవార్డు దక్కింది. సోమవారం మంత్రి సీతక్క నుంచి ఆయన ఆవార్డు అందుకున్నారు.వ్యవసాయ రంగంలో ప్రతిభ కనబరిచిన జర్నలిస్టులకు ప్రోత్సాహం అందించేందుకు నిర్వహించిన మెగా రైతు మేళా-2026లో ఓ న్యూస్‌లో ఛానల్‌లో పని చేస్తున్న జర్నలిస్ట్ గొల్ల నరేష్‌కు వ్యవసాయ గ్రామీణ జర్నలిస్టు అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం మార్చి 8,9 తేదీల్లో ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్‌లో నిర్వహించిన మెగా రైతుమేళా సందర్భంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ, కోరోమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించాయి.వ్యవసాయం, రైతుల సమస్యలు, గ్రామీణ అభివృద్ధి అంశాలపై నిరంతరం వార్తలు ప్రసారం చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నందుకుగాను నరేష్‌కు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు యూనివర్సిటీ వీసీ జానయ్య తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు, కోరోమండల్ ప్రతినిధులు నరేష్‌ను అభినందించారు.


జర్నలిస్టు నరేష్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న మంత్రి సీతక్క

# మనిషి జీవిత కాలంలో ఐదు మొక్కలు నాటి సంరక్షించాలి

### మెదక్ డిఎస్‌పి ప్రసన్నకుమార్


మాట్లాడుతున్న మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్

**టేక్మాల్, మార్చి9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని దాదాయపల్లి గ్రామంలో వనజీవి రామయ్య పార్కును సోమవారం మెదక్ డిఎస్పిలు సుభాష్ చంద్రబోస్, ప్రసన్నకుమార్ ప్రారంభించారు. అనంతరం మెదక్ డిఎస్‌పి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, జనాభా పెరుగుతున్న కొద్దీ వాతావరణ కాలుష్యం పెరిగి మానవులకు ఆక్సిజన్ అందటమే కష్టంగా మారిందన్నారు. అందుకే ఎక్కువ జనాభా రోగాల బారిన పడుతుందని గుర్తు చేశారు. మనిషి బతికిన జీవితకాలంలో కనీసం ఐదు మొక్కలు నాటి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. దాదాయపల్లి సర్పంచ్ దేశ్పాండే నర్సింగ్‌రావు సొంత 20 గుంటల భూమిని, దానంగాఇచ్చి అందులో కొబ్బరి చెట్లను నాటి గ్రామపంచాయతీకి ఇవ్వడం అర్భించదగ్గ విషయమన్నారు. గ్రామంలో ఎవరైనా రైతులు ప్రజలు, ఐదు మొక్కలు నాటి సంరక్షిస్తే, గ్రామ పంచాయతీకి నల్లా, ఇంటి బిల్లు చెల్లించకుండా స్వయంగా ఆ బిల్లులు భరిస్తామని ఇది ఐదు సంవత్సరాలవరకు వర్తిస్తుందని చెప్పారు. వాసవిక్ ఫౌండేషన్ చైర్మన్ నీడిగొండ నరేష్‌కుమార్. మాట్లాడుతూ దాదాయపల్లి గ్రామం ఎంతో పుణ్యం చేసుకొని ఉందన్నారు. ఎంతో త్యాగ పురుషుడైన వనజీవి రామయ్య పేరును ఈ పార్కు ఈ గ్రామం నుండి ప్రారంభించడం హర్షించదగ్గ విషయం అన్నారు. వనజీవి రామయ్య జీవిత చరిత్ర ప్రతి ఒక్కరూ చదివి ఆయనను ఆదర్శంగా తీసుకొని మొక్కలు నాటాలని చెప్పారు. వనజీవి రామయ్య తన జీవితకాలం మొత్తం మొక్కలు నాటి భారత ప్రభుత్వం చేత పద్మశ్రీను బిరుదును ప్రధానం చేసిందని ఆయన గుర్తు చేశారు. అలాంటి మహాను భావుని ఆదర్శంగా తీసుకొని గ్రామస్తులు మొక్కలు నాటాలని చెప్పారు. కార్యక్రమంలో మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి, అందోల్ జగన్మోహన్ రెడ్డి, జోగుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, మల్కాపూర్ సర్పంచ్ సాయి కృష్ణ, రేగోడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, రమేష్ జోషి, గ్రామ ప్రజలు వార్డ్ మెంబర్లు తదితరులు ఉన్నారు.



నూతన కమిటీ

## రైతు సంఘం నూతన కమిటీ నియామకం

**చిన్నకోడూరు, మార్చి 9, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దకోడూరు గ్రామంలో రైతు సంఘం గ్రామ కమిటీని నియమించారు. అధ్యక్షులుగా దేవేందర్, ఉపాధ్యక్షులుగా బట్టు రాజు, కార్యదర్శిగా బర్మా శ్రీశైలం, కోశాధికారిగా సుదాల నర్సయ్య, గౌరవాధ్యక్షులుగా బట్టు తిరపతిలను నియమించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చల్లారపు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రుణాలు ఇచ్చి కార్యకర్తలను ఆదుకోవాలి


ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతంను కలిసిన మీసం మహేందర్ యాదవ్

**చిన్నకోడూరు, మార్చి 9, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీలోని దళిత కార్యకర్తలకు అత్యధికంగా కార్పొరేషన్ రుణలిచ్చి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్‌యాదవ్ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రితంను కోరారు. సోమవారం హైదారాబాద్‌లోని ఆయన కార్యాలయంలో టిపిసిసి నాయకులు దేవులపల్లి యాదగిరి, సీనియర్ నాయకులు సాకి అనంద్‌తో కలిసి చిన్నకోడూరు,నంగునూర్ మండలాలకు చెందిన నిరుద్యోగ దళితులకు నిధులిచ్చి ఉపాధి కల్పించాలని విన్నవించారు. ఆయా మండలలాకు అత్యధిక రుణాలు ఇచ్చి ఆదుకుంటానని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రితం తెలిపినట్లు ఆయన వివరించారు.

## ఘనంగా మహిళా దినోత్సవం

**కోహెడ, మార్చి 9, ప్రభాతవార్త :** మండలంలోని సముద్రాల గ్రామంలో ఆదివారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ వార్డు మెంబర్ వేల్పుల బాలమణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ మహిళలను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, అన్ని రంగాల్లో మహిళలు ముందుకు రావాలని వేల్పుల బాలమణి ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు మహిళలు, యువతులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

**అక్కన్నపేట, మార్చి 9, ప్రభాతవార్త :** మండలంలోని చౌటపల్లి గ్రామం నుంచి గొల్లపల్లి గ్రామానికి అలాగే వ్యవసాయ బావులకు వెళ్లే దారిలో ఉన్న బతుకమ్మ వాగుపై నిర్మించనున్న కల్వర్టు బ్రిడ్జి పనులకు సోమవారం సర్పంచ్ పత్తిపాక లావణ్య త్రిమూర్తి భూమిపూజ నిర్వహించారు. చౌటపల్లి గ్రామ సర్పంచ్ పత్తిపాక లావణ్య త్రిమూర్తి ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఈ బ్రిడ్జి నిర్మాణం ద్వారా రాకపోకలు సులభం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు ఆత్మ కమిటీ చైర్మన్ జంగంపల్లి ఐలయ్య, చౌటపల్లి ఉప సర్పంచ్ పులికాసి రమేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న దృశ్యం


విజేతలకు బహుమతులు అందిచిన సర్పంచ్ దామోదర్

## కాంప్లెక్స్ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

**అక్కన్నపేట, మార్చి 9, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలం రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన కాంప్లెక్స్ స్థాయి పోటీలలో గౌరవెల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు పలు విభాగాల్లో మొదటి బహుమతులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. క్విజ్, వ్యాసరచన, శతక పద్యాలు, పాటల పోటీలు, మెమొరీ టెస్ట్‌లలో మొదటి బహుమతులు సాధించగా, డ్రాయింగ్ పోటీలో మూడవ బహుమతి పొందారు. విజేతలను సోమవారం గౌరవెల్లి గ్రామ సర్పంచ్ పాండ్రాల దామోదర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గొల్లపల్లి రేణుక చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గుగులోతు మల్లేశం, ఉపాధ్యాయులు పాషా, ప్రకాష్, శ్రీనివాస్, మల్లయ్య, నీరజ, సంధ్య ఉన్నారు.

## ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలి

### ఎంఈఓ బచ్చలి సత్తయ్య

**కొండపాక, మార్చి 9, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 2026 అమలు తీరును పరిశీలించడానికి సోమవారం కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బచ్చలి సత్తయ్య సందర్శించారు. పరిశుభ్రత, పారిశుధ్యం, సంస్థాగత నిర్వహణ, రికార్డుల నిర్వహణ తదితర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన సూచనలు సక్రమంగా పాటించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయులను, అంగన్‌వాడీ టీచర్లను, ఆయా, మధ్యాహ్న భోజన కార్మికులను ఎంఈఓ శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు శంకరయ్య, నాగరాణి, సరిత, పుణ్యవతి, అంగన్‌వాడి టీచర్లు పరిపూర్ణ, అయా ప్రవంతి, వంట కార్మికులు హంసవ్వ, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలి

### సిఐటియూ జిల్లా నాయకుడు అమ్ముల బాల్‌నర్సయ్య

**కొండపాక, మార్చి 9, ప్రభాతవార్త :** పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఖాళీ గ్యాస్ సిలిండర్‌తో సిఐటియూ అధ్వర్యంలో సోమవారం వెలికట్ట గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అయన వెలికట్టలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెద మధ్య తరగతి ప్రజల నడి విరిచే విధంగా గ్యాస్ ధరలను పెంచిందని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు అమ్ముల బాల్ నర్సయ్య మండి పడ్డారు. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ॥ 60, వాణిజ్య సిలిండర్ ధర రూ॥ 115కు పెంచడంవల్ల నిరుపేదలపై మోయలేని భారం పడుతుందన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడంవల్ల ఇతర నిత్యవసర ధరలు పెరుగుతాయని వెంటనే పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని అయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తు పేద మధ్యతరగతి ప్రజలను మోసంచేస్తుందన్నారు. కార్యక్రమంలో సిఐటయు జిల్లా నాయకుడు బర్మ కొమురయ్య, కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కొమురవెళ్ళి కనకయ్య, నాయకులు బంగారి లచ్చవ్వ, అమ్ముల మల్లవ్వ, అమ్ముల పద్మ, నర్సవ్వ, మెరుగు నర్సింలు, దొమ్మాట ఎల్లయ్య, మహమ్ముద్ అలీ, గంపల బాలయ్య, మెరుగు శివ, రాజయ్య పాల్గొన్నారు.



ఖాళీ గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

# మహిళలు తలచుకుంటే అద్భుత ఫలితాలు సాధ్యం

### కావేరి యూనివర్సిటీ విసి ప్రవీణ్‌రావు


మహిళలను సన్మానిస్తున్న కావేరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రవీణ్‌రావు

**వర్గల్, మార్చి 9 (ప్రభాతవార్త):** మహిళలు తలుచుకుంటే అద్భుతఫలితాలు సాధిస్తారని కావేరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రవీణ్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం వర్గల్ మండలం గౌరారంలోని కావేరి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శక్తి నేషనల్ లీడర్‌షిప్ కాంక్లేవ్ 2026 ఘనంగా నిర్వహించారు. అయితే విద్యార్థులు, అధ్యాపకులలో స్ఫూర్తిని నింపేందుకు ప్రముఖ మహిళా సాధకులను ఒకే వేదికపైకి తేగా, ఉపన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఇంటరాక్టివ్ సెషన్ల ద్వారా మహిళా నాయకత్వం, ఆత్మస్థైర్యం, సమాజానికి వారు చేసిన సేవలు పేర్కొంటూ స్ఫూర్తిని నింపారు. విద్య, ఉపాధి నాయకత్వంలో వారికి సమాన అవకాశాలు దక్కితేనే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. శక్తి కార్యక్రమాన్ని ఆయన అభినందిస్తూ ఇంతటి విజయం సాధించిన మహిళలు క్యాంపస్‌కు రావడం విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరడానికి, సంప్రదాయ అడ్డంకులు అధిగమించడానికి ఎంతో ప్రేరేపిస్తుందని తెలిపారు. ఆభాస రిహబ్ సెంటర్ డైరెక్టర్ గాయత్రి అరవింద్, ఎస్ఎంఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ మంజులరావు, ఐసిఏఆర్ రిటైర్డ్ ప్రిన్సిపల్, శాస్త్రవేత్త కెబిఆర్ఎస్ విశారద, గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత సోఫియా సూఫీ, స్ట్రాటజీ మరియు బిజినెస్ మాజీ సీఈవో వైశాలి నియోజియా, క్లాసికల్ డ్యాన్సర్, గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ గ్రహీత విదూషి దీక్షలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రవీణ్‌రావు సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో మానసిక ఆరోగ్యం, స్వస్థత, సహానుభూతి అవసరమని అన్నారు. విద్యార్థులు మానసిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళల స్వాతంత్ర్యానికి ఆర్థిక సాధికారత కీలకమని చెప్పారు. యువతులు ఆర్థిక అక్షరాస్యతపై దృష్టి పెట్టాలని, ఉద్యోగం కోసం చూడకుండా తామే ఉద్యోగాలు సృష్టించాలని ఆకాంక్షించారు. ఇదిలా వుండగా విద్యార్థిని అంజలి బృందం స్త్రీతత్వాన్ని కీర్తిస్తూ చేసిన ప్రదర్శన ఉత్సాహం నింపింది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు, డైరెక్టర్ హర్ష పోలసాని, డీన్స్ డాక్టర్ కొండ శ్రీనివాస్, డాక్టర్ ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

**గజ్వేల్ టౌన్, మార్చి 9 (ప్రభాతవార్త):** పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.శోభరాణి తెలిపారు. క్యాంపస్ యాత్ర, వైష్ణవి టెక్నాలజీస్, ఐసిఐసిఐ బ్యాంక్, క్వాంటం హెచ్ఆర్ఎం సిస్టం ప్రైవేట్ లిమిటెడ్, మెరీనా పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు ఇతర కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ డ్రైవ్‌లో ఇంటర్, డిగ్రీ, పిజి 2023, 24, 25 మరియు ప్రస్తుతము డిగ్రీ చదువుతున్న వారు అర్హులని, అభ్యర్థులు వారి సర్టిఫికెట్స్‌తో పాటు రెండు జతల రెజ్యూమ్, ఆధార్ జిరాక్స్, రెండు పాస్ ఫోటోలు, తీసుకొని రావాలని సూచించారు. ఏదైనా సందేహం ఉంటే 8985710323 నెంబర్‌కి ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని తెలిపారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

**మర్కుక్, మార్చి 9 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో ఈనెల 10వ తేదీ మంగళవారం ఉచిత గాలికుంటు నివారణ టీకాలను వేయడం జరుగుతుందని మండల పశువైద్యాధికారి డాక్టర్ శిరీష తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామంలోని రైతులు ఆవులు, లేగ దూడలు, గేదెలు, దూడలు, ఎద్దులకు గాలికుంటు నివారణ టీకాలను వేయించాలని సూచించారు. ఇట్టి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రైతు తన వెంట ఆధార్ కార్డు జిరాక్స్, సెల్‌ఫోన్ తీసుకొని రావాలని పేర్కొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ వివాదం

### స్టేజీపైకి సర్పంచులను పిలవలేదని ఆగ్రహం

**అక్కన్నపేట, మార్చి 9, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ వివాదం నెలకొంది. అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను ఆత్మ కమిటీ చైర్మన్ జంగంపల్లి ఐలయ్య పంపిణీ చేయడంపై పలువురు సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచులను స్టేజ్‌పైకి పిలవకుండా ఎలాంటి ప్రొటోకాల్ పాటించకుండా కార్యక్రమాన్ని నిర్వహించడం సరికాదని వారు మండిపడ్డారు. ప్రజాప్రతినిధులైన తమను పక్కన పెట్టి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల అక్కన్నపేటలో నిర్వహించిన హెల్త్ క్యాంప్ కార్యక్రమాన్ని కూడా తానే ముందుండి నడిపించాడని, అలాగే వార్డ్ మెంబర్ల శిక్షణ తరగతుల్లో సర్పంచుల పాత్రను పక్కన పెట్టాడని, పలువురు సర్పంచులు ఆరోపించారు. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో తానే ముందుండి వ్యవహరిస్తే తాము సర్పంచులుగా ఉండి ఏం చేయాలని వారు ప్రశ్నించారు. ఇదే విషయాన్ని ప్రభాతవార్త తాసిల్దార్ సింహాచలం మధుసూదన్ ను వివరణ కోరగా కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్, ఎంపీపీ, జడ్పిటిసి లకు మాత్రమే ప్రొటోకాల్ ఉంటుందని, ఆత్మ కమిటీ చైర్మన్ లకు ఉండదన్నారు. ఆత్మ కమిటీ అంటే వ్యవసాయ శాఖకు సంబంధించిన కార్యక్రమాల్లోనే పాల్గొనవలసి ఉంటుందని స్పష్టం చేశారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన్న కార్యక్రమం

**అక్కన్నపేట, మార్చి 9, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చెరువు ముందు తండా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన్న కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్ బానోతు శ్రీలత ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ మంగమ్మ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులకు సంప్రదాయ బద్ధంగా అన్నప్రాసన చేయించి ఆశీర్వదించారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహారం గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేశ నాయక్ తండా సర్పంచ్ లావుడ్య సులోచనదేవన్‌నాయక్, ఉప సర్పంచ్ లావుడ్య బాలాజీనాయక్, కార్యదర్శి మహేష్, గర్భిణీలు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్, పెన్నుల పంపిణీ

**అక్కన్నపేట, మార్చి 9, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అక్కన్నపేట గ్రామ సర్పంచ్ జన్నారపు సంపత్ సోమవారం పరీక్ష ప్యాడ్‌లతో పాటు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని ప్రతీ విద్యార్థి పట్టుదలతో చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## దాదాయపల్లిలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభం

**టేక్మాల్, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని దాదాయపల్లి గ్రామానికి వాటర్‌ప్లాంట్‌ను దాత వాసవీ ఫౌండేషన్ చైర్మన్ మేడికొండ నరేష్‌కుమార్ ప్రారంభించారు. సోమవారం దాదాయపల్లిలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కలుషిత నీటిని తాగి అనారోగ్యం పాలు అవుతున్నారని సర్పంచ్ నర్సింహారావు దేశ్‌పాండే తనదృష్టికి తీసుకు వచ్చారన్నారు. అనుకున్నదే తడువుగా వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సహకారం అందజేసినట్లు ఆయన చెప్పారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండడంతో పాటు గ్రామాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని, వాస్ విత్ ఫౌండేషన్ చైర్మన్ నరేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ డిఎస్పి లు, షిరిడి ప్రసన్నకుమార్, శ్రీ ఏ సుభాష్ చంద్రబోస్, అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, రేగోడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రమేష్ జోషి, వ్యాపారవేత్త రమేష్ సెట్, దాదాయపల్లి గ్రామ పాలకవర్గం ఉప సర్పంచ్ తదితరులున్నారు.

## పేద కుటుంబానికి బియ్యం అందజేత

**చిన్నకోడూరు, మార్చి 9, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నర్సయ్య కుటుంబాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ సోమవారం అల్లీపూర్ పార్టీ కార్యకర్తలతో కలిసి పరామర్శించి ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబానికి 50 కిలలో బియ్యం అందజేశారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, బాబు, శంకర్, మహేష్, బాలయ్య, బాబు, అజయ్, నితిన్ పాల్గొన్నారు.

## నేడు అబ్లాపూర్‌లో వెంకటేశ్వరస్వామి కళ్యాణం

**పాపన్నపేట, మార్చి 9, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అబ్లాపూర్‌లో మంగళవారం వెంకటేశ్వర స్వామి కళ్యాణం జరుగుతుందని దేవాలయ వ్యవస్థాపకులు నీరుడి నారాయణ తెలిపారు.ఆలయ దశమ వార్షికోత్సవం పురస్కరించుకొని వెంకటేశ్వరస్వామి, శివపార్వతుల కళ్యాణం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి రంగంపేట పీఠాధిపతి మాధవనంద సరస్వతి హాజరు అవుతారని తెలిపారు.

## ఏకలవ్య ఐఐటీ పరీక్షల్లో స్టేట్ ఫస్ట్ సాధించిన ఆరాధ్య

**హుస్నాబాద్ రూరల్ మార్చి 9, ప్రభాతవార్త:**

పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.ఆరాధ్య ఏకలవ్య ఐఐటీ సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఐఐటీ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబర్చి స్టేట్ ఫస్ట్ టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఆమెకు ఏకలవ్య ఐఐటీ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఏకలవ్య అన్యువల్ స్కూల్ మీట్ కార్యక్రమంలో ఘనంగా అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లోని రామకృష్ణ మత్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జయప్రకాశ్ నారాయణ, నాగేశ్వరావు హాజరై విద్యార్థులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా 6వ తరగతి చదువుతున్న పి. ఆరాధ్య ఐఐటీ స్టేట్ ప్రథమ అవార్డును అందుకుంది. అలాగే ద్వితీయ శ్రేణి అవార్డులను ఎల్.వైష్ణవి, రామ్‌చరణ్, సాయిహవీష్ అందుకున్నారు. అవార్డులు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సత్కరించారు.

## ఆచార్య డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం

**జహీరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:**

పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్ మాట్లాడుతూ మహిళలు భారరత దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో గొప్పగొప్ప ఆవిష్కరణలు ఆవిష్కరించి భారత మహిళలు అనేక విజయాలు సాధించి దేశ కీర్తి ప్రతిష్టతలను ఉమ్మడింపచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు పాల్గొని మహిళా అధ్యాపకులను శాలువాతో సత్కరించి మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అద్యాపకులు నవీన, కీర్తి, దీపిక, శ్రావణి, నవనీత, నిఖిత, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి కృషి చేయాలి

## మున్సిపల్ చైర్మన్ లావణ్య నాగరాజు

**రామాయంపేట, మార్చి 9, ప్రభాతవార్త :** ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని రామాయంపేట మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన 5కే రన్ స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానం వద్ద మున్సిపల్ చైర్మన్ లావణ్య పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు, సిబ్బంది, మెప్మా ఆర్‌పీలతో సాగిన ఈ రన్ బస్టాండ్, వివేకానంద సర్కిల్, సిద్దిపేట రోడ్డు, రాజేంద్రనగర్, మున్సిపల్ కార్యాలయం, మహంకాళి వీధి మీదుగా కళాశాల మైదానానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నడక, వ్యాయామం ఎంతో అవసరమన్నారు. రోజువారీ జీవితంలో కొంత సమయం కేటాయించి నడక చేస్తే అనేక రకాల వ్యాధులను దూరం చేసుకోవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోచమ్మల నవనీత, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, కొక్కు ప్రవీణ్, గుగులోత్ రవి, భైరం స్వప్న, జంగంపల్లి శంకర్‌గౌడ్, దేవుని రంజిత్, మద్దెల మాధవి, మున్సిపల్ అధికారులు బాలక్రిష్ణ, వార్డు అధికారులు, ప్రజాప్రతినిధులు దాకి స్వామి, చింతల స్వామి, మెప్మా ఆర్పీలు మర్కు లావణ్య, రజిత, శ్రీలత, స్రవంతి, రోహిణి, విజయశ్రీ, కవిత, ఆర్.స్రవంతితో పాటు యువకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.


రామాయంపేటలో 5కే రన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్యానాగరాజు


మాట్లాడుతున్న క్రాంతికుమార్

## పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన ఉండాలి

### ఎంపిడివో క్రాంతికుమార్

**పెద్దశంకరంపేట, మార్చి 9, ప్రభాతవార్త :** పంచాయతీరాజ్ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో క్రాంతికుమార్ అన్నారు. సోమవారం రైతువేదికలో నిర్వహించిన మొదటి విడత వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణ కార్యక్రమంలో మొదటి విడతగా 13 గ్రామపంచాయతీలకు చెందిన 120 మంది వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో క్రాంతికుమార్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. గ్రామస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావాలంటే వార్డు సభ్యులు పంచాయతీరాజ్ చట్టం, నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామసభలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ గ్రామాభివృద్ధికి సహకరించాలని వార్డ్ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ షాకిర్ అలీ, ఎంపీఓ జాకీర్ హుస్సేన్, ఈవో వెంకట్ రాములు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## గురుకులాన్ని సందర్శించిన ఆర్డీవో


జేఈఈలో 91.2% సాధించి విద్యార్థి విజయ్ అభినందించిన ఆర్డీవో

**కౌడిపల్లి, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తునికి గ్రామంలో కల ఎంజేపిటిబిసిడబ్ల్యూఆర్ గురుకులంలో చదువుతున్న విజయ్ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన జేఈఈ మెయిన్ ఫేజ్-1లో 91.2% పర్సెంటెజ్ సాధించగా నర్సాపూర్ ఆర్డీవో పి.రామకృష్ణా, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపిడివో శ్రీనివాస్‌లు అభినందించారు. సోమవారం ఆర్డీవో మండల వివిధ శాఖాధికారులతో తునికి గ్రామ శివారులో గల ఎంజేపిటి బిసిడబ్ల్యూఆర్ గురుకులంను సందర్శించారు. ముందుగా కార్యాలయం లోగల పలురికార్డులను పరిశీలించిన తర్వాత పాఠశాల ప్రాంగణాన్ని సందర్శించి విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం గురుకులంలోగల వంటగదిని సందర్శించి, విద్యార్థులకు వండుతున్న భోజన పదార్థాలను పరిశీలించి, మధ్యాహ్న భోజనం తొటి విద్యార్థులకు కలిసి తన వెంట వచ్చిన అధికారులు, గురుకులం ప్రిన్సిపాల్‌తో కలిసి భోజనం చేశారు. కళాశాలలో అభివృద్ధి గురించి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇందిరమ్మ లబ్దిదారులు నిర్మించుకుంటున్న ఇళ్లను పరిశీలించి, త్వరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్దిదారులకు ఆర్డీవో పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపివో రామారావు, ప్రిన్సిపాల్ హరిబాబు, తునికి గ్రామ సర్పంచ్ ధనలక్ష్మిశేఖర్, ఉప సర్పంచ్ మధుసూదన్‌గౌడ్, గ్రామపెద్దలు సాయాగౌడ్, కొండల్‌రెడ్డి, చల్ల మల్లేశం, శంకర్, విద్యార్థులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఏళ్లు గడుస్తున్నా కళ్యాణలక్ష్మి చెక్కులు అందించరా ?


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న రాథోడ్ సురేష్‌నాయక్

**కంగ్టి, మార్చి 9, ప్రభాతవార్త:** పెళ్లిళ్ల జరిగి ఏళ్లు గడుస్తున్నా కళ్యాణ లక్ష్మి చెక్కులు అందించకుండా గిరిజనులను ఇబ్బంది పెట్టడం సరికాదని జిల్లా గిరిజనుల ఉప సర్పంచుల అధ్యక్షులు రాథోడ్ సురేష్‌నాయక్ అన్నారు. సోమవారం కంగ్టిలోని రెవెన్యూ కార్యాలయంలో గిరిజనులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా రాథోడ్ సురేష్‌నాయక్ మాట్లాడుతూ జిర్గి తండా పంచాయతీ పరిధిలోని రామ్‌సింగ్‌తండా, మెట్టుతండా, జిర్గితండాలలో రెండు సంవత్సరాలనుంచి వివాహాలు చేసుకున్న 9 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులు అందించడం లేదన్నారు. తండాల పరిధిలోని చేసుకునేందుకు పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం మూలంగా తమ చిన్నారులు విద్యను అందుకోలేకపోయారని, విద్యను అందుకోకుండా చదువు సర్టిఫికెట్లు లేవని, కళ్యాణ లక్ష్మి చెక్కుల కొరకు విద్యార్హత సర్టిఫికెట్లు కావాలని అధికారులు కొర్రీ పెడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. వివాహాలు చేసుకున్న పేద గిరిజనులకు ప్రభుత్వం అందించే 1లక్ష 16 వేల రూపాయల కళ్యాణలక్ష్మి చెక్కులు అందించి పేద గిరిజనులను ఆదుకోవాలని రాథోడ్ సురేష్ నాయక్ వినతి చేశారు.

## ఉపాధి కూలీల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

**మునిపల్లి, ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త):** ఉపాధి కూలీలకు నాలుగు వారల నుంచి పెండింగ్‌లో ఉన్న బకయిలను వెంటనే చెల్లించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ మండల కార్యదర్శి మ్యాతరి గంగమ్మ డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలు ఏర్పాటు చేసిన మీటింగ్‌కు ఆమె హాజరై మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు రెండు పూటల ఫొటో విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. అలాగే రోజుకు రూ 600 కూలి చెల్లించాలి. ఎండలు రోజురోజుకు ముదురుతున్న సందర్భంగా పనిచేసే చోట టెంట్లు. మంచినీళ్లు.మెడికల్ కిట్లు. వసితిని ఏర్పాటు చేయాలి. మరియు ఉపాధి పని దినాలను సంవత్సరానికి 200 రోజు లు పెంచాలని. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఇంకా ఈ కార్యక్రమంలో.రాజు. వినోద. రాణమ్మ.పూలమ్మ మల్లమ్మ.ఎల్లమ్మ.సంగీత తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ ఉద్యోగుల నిరసన

**మనూర్, మార్చి 9, ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మనూర్‌లో మండల వనరుల కేంద్రం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశామన్నారు. ప్రభుత్వం వెంటనే న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ నరేష్, కంప్యూటర్ ఆపరేటర్ మాణిక్, సిబ్బంది పాల్గొన్నారు.



మనూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

## కెజిబివి ఎదుట ఉద్యోగుల నిరసన

**అల్లాదుర్గం, మార్చి 9, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ఎదుట టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యుఆర్ఎస్, సమగ్ర శిక్షా ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ సమగ్ర కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి మూడు దశలుగా పోరాం చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని, మొదటిదశలో భాగంగా సోమవారం పాఠశాల ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశామన్నారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే మార్చి 16న జిల్లా కేంద్రాల్లో నిరసనలు వ్యక్తం చేయాల్సి వస్తుందని, అప్పటికి తమ డిమాండ్‌లను పరిష్కరించకుంటే చలో అసెంబ్లి కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అల్లాదుర్గం కేజీబీవీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినులకు పరీక్షా సామాగ్రి, శానిటేషన్ కిట్స్ పంపిణీ

**ములుగు, మార్చి 9 (ప్రభాతవార్త):** శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ విజన్ 1లో భాగంగా సోమవారం ములుగు మండల పరిధిలోని లక్ష్మక్కపల్లిలో గల విపిజే ఫంక్షన్ హాల్‌లో పదవ తరగతి విద్యార్థినులకు ఆర్‌విఎం ఆసుపత్రి స్త్రీ వైద్య నిపుణులచే ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా విద్యార్థినులకు పరీక్షా సామాగ్రిని, శానిటేషన్ కిట్స్‌ను అందించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు విష్ణుజగతి మాట్లాడుతూ మండలంలోని 800 మంది విద్యార్థినులకు శానిటేషన్ కిట్స్‌ను అందించనున్నట్లు తెలిపారు. అనంతరం వైద్యులను, ఉపాధ్యాయులను ట్రస్టు ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి, శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ కోశాధికారి గంప ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీ మొగిలి రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు కోలా భాస్కర్, ఆర్‌విఎం వైద్యులు డాక్టర్ పోషాల ప్రజ్ఞ, డాక్టర్ ఎస్.తేజస్వి, డాక్టర్ దీప్తిక, ఉపాధ్యాయులు, ఆర్‌విఎం మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## 32 మందికి కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**చౌటకూరు, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 32 మంది లబ్దిదారులకు సోమవారం మండల కేంద్రమైన చౌటకూరరులో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నత్తి దశరథ్, మాజీ ఎంపిపి అధ్యక్షులు భూంరెడ్డి సుభాష్‌రెడ్డిలు పంపిణి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నామాల కిష్టయ్య, ఎంపిడిఓ శంకర్, ఆత్మ కమిటి చైర్మన్ మల్లారెడ్డి, సర్పంచ్‌లు పార్కల రాంరెడ్డి, జైపాల్‌నాయక్, నందికంటి రామచంద్రారెడ్డి, గొల్ల మల్లేశం, నాయకులు కలాలి ఈశ్వర్‌గౌడ్, రామాగౌడ్, వర్కల రమేశ్, సార గోవర్ధన్ ముదిరాజ్, గొల్ల రాములు, ప్రభాకర్‌రెడ్డి, చక్రియాల శ్రీలక్ష్మి అనంత పద్మనాభ స్వామి ఆలయ కమిటి చైర్మన్ భానూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డును పరిశీలించిన జిసిఎంసి కమిషనర్ సృజన

**రామచంద్రాపురం, మార్చి 9, ప్రభాతవార్త:** గోపల్‌పల్లి నుంచి తెల్లాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిని సోమవారం గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన పరిశీలించారు. రాబోయే రోజుల్లో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని రోడ్డు సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వేకు సంబంధించిన సాంకేతిక అంశాలపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా ప్రణాళిక బద్దంగా రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులు చేపట్టాలని, రోడ్డుపై ఏర్పడిన గోతులను పూడ్చాలని సూచించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ జ్యోతిరెడ్డి, డీఈఈ కృష్ణవేణి, ఏఈఈ ఫైజాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.


గోపన్‌పల్లి-తెల్లాపూర్ రోడ్డును పరిశీలిస్తున్న జీహెచ్ఎంసి కమీషనర్ శ్రీజన


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న మున్సిపల్ చైర్మన్

## మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేయండి

### -అదనపు కలెక్టర్‌కు మున్సిపల్ చైర్మన్ వినతి

**జహీరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల్‌లోని ఆయా వార్డులలో వేసవి కాలన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి నెలకొనకుండా అవసరమైన నిధులను మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ కౌన్సిలర్లు జంగీర్, జమీల్, అక్రమ్, జాఫర్, జావిద్‌లతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్‌లోని అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి ప్రాంతాలను అధికారికి వివరించారు. పదుపద్ద పైప్‌లైన్‌లతో నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరాకు ఆటంకాలు లేకుండా చూడాలని వినతి చేశారు.

## నగర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం : జ్యోతిరెడ్డి


కాలనీ వాసులతో సమీక్షిస్తున్న సర్కిల్ డీసీ జ్యోతిరెడ్డి

**రామచంద్రాపురం, మార్చి 9, ప్రభాతవార్త:** పటాన్‌చెరు సర్కిల్ పరిధిలోని 4 డివిజన్‌ల పరిధిలోని ఆయా కాలనీల అభివృద్ధితోపాటు ప్రజల సమక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్‌చెరు సర్కిల్ డిప్యూటీ కమీషనర్ జ్యోతిరెడ్డి అన్నారు. సోమవారం తెల్లాపూర్‌లోని సర్కిల్ కార్యాలయంలో విస్తృత స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ముందుగా పట్టణ సమాజ అభివృద్ధి విభాగం ప్రాజెక్టు అధికారి, రిసోర్స్ పర్సన్‌లతో సమావేశం అయిన కమీషనర్ క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల మంజూరులో జాప్యం జరగకూడదని ఆదేశించారు. ఆర్‌పిలు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ అర్హులైన ప్రతి లబ్దిదారుడికి ప్రభుత్వ సేవలు అందేలా చూడాలని సూచించారు. వివిధ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల ప్రతినిధులతో సమావేశం అయి కాలనీలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలు, పారిశుద్య నిర్వాహణ, అంతర్గత రోడ్ల మరమ్మత్తులు, డ్రైనేజి వ్యవస్థ మెరుగుదలపై అసోసియేషన్ సభ్యులు కమీషనర్ దృష్టికి తీసుకుపోగా స్పందించిన డిప్యూటీ కమీషనర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో యూసీడి సిబ్బంది, పలు కాలనీల అసోసియేషన్ బాధ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకే 5కె రన్

### -మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్

**గజ్వేల్, మార్చి 9 (ప్రభాతవార్త):** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 5కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్ జెండా ఊపి 5కె రన్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా 4వ రోజు మున్సిపాలిటీలో 5కె రన్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలలో ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకే 5కె రన్ నిర్వహించినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో రాజీవ్‌పార్కు, హెర్బల్ పార్కులో సేంద్రీయ ఎరువుల గుంతలను తీయించారు. పార్కులలో వెలువడే ఆకులు, గడ్డి, ఇతర వ్యర్థాలను పారవేయకుండా వాటిని శాస్త్రీయంగా కుళ్లింపజేసి సేంద్రీయ ఎరువుగా మార్చడం ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. అనంతరం 5కె రన్‌లో పాల్గొన్న యువకులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, 3వ వార్డు కౌన్సిలర్ కాముని మురళి, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎరువుల సమస్య రానీయొద్దు : ఆర్డీవో

**రామాయంపేట, మార్చి 9, ప్రభాతవార్త :** పంటలకు ఎరువుల కొరత ఉండకూడదని మెదక్ ఆర్డీవో రమాదేవి సూచించారు. మంగళవారం ఆమె తహసీల్దార్ రజినీకుమారితో కలిసి ఎరువుల కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను స్వయంగా పర్యవేక్షించి, అక్కడి రికార్డులను పరిశీలించారు. అక్కడికి ఎరువుల కోసం వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి విషయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు సమయానికి అందుతున్నాయా... లేదా అన్నదానిపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. రైతులకు ఎరువుల సరఫరా సక్రమంగా జరిగేలా కఠిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత విభాగాల సిబ్బంది మండలాల వారీగా ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు పరిశీలించి రైతులకు ఎరువులు సరైన విధంగా అందుతున్నాయా లేదా అన్నది నిర్ధారించాలని తెలిపారు. ముఖ్యంగా యూరియా వంటి ముఖ్య ఎరువుల సరఫరా విషయంలో ఎలాంటి లోపాలు ఉండకుండా చూడాలని ఆదేశించారు. అలాగే రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు సంబంధిత కార్యాచరణను సమన్వయం చేసుకుంటూ తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ స్థాయి సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు. ఇక రామాయంపేట పరిధిలోని పాక్స్ కన్వీనర్లు, ఎంపీఎస్సీ ఎస్ రామాయంపేట, పాక్స్ కార్యదర్శులు సహ వివిధ స్థాయిల్లో మొత్తం 450 మంది ప్రతినిధులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా రైతుబజార్ పరిధిలో 400 మంది రైతులతో సమావేశాలు నిర్వహించి సమస్యలను తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా అక్రమాలు లేదా నిల్వలు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రజిని కుమారి. ఆర్ఐ మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.


రామాయంపేటలో ఎరువుల దుకాణం వద్ద మహిళా రైతుద్వారా విషయాలు తెలుసుకుంటున్న ఆర్డీవో రమాదేవి



శిక్షణ పొందిన మహిళలకు ధృవపత్రాలు అందచేస్తున్న అధికారులు

## మహిళలకు టైలరింగ్ యూనిట్ల పంపిణీ

**న్యాల్‌కల్, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రేజింతల్ గ్రామంలో మూడు నెలల పాటు కుట్టులో శిక్షణ పొందిన 90 మంది మహిళలకు సోమవారం జహీరాబాద్‌లోని మహీంద్రా అండ్ మహీంద్రా కర్మాగారం ఎడి ప్లాంట్ హెడ్ అనిల్‌కుమార్, సిఎస్ఆర్ హెడ్ శ్రీకాంత్, ఆదిమన్ మధుకుమార్ సదాశివిని, సతీష్, బిఏఎఫ్ లైవ్‌లిహుడ్ జహీరాబాద్ బృంధం ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రాగిణి, స్టీ షణ్ముఖ సాయి, అన్వేష్, ప్రజ్వల్‌లు పాల్గొని మహిళలకు ధృవప్రాలు, టైలరింగ్ యూనిట్లను పంపిణి చేశారు. మూడు నెలల పాటు శిక్షణ పొందిన మహిళలు ఇక నుంచి ఇండ్లలో నుంచే కుట్టు పనులు చేసుకుంటూ ఉపాధి పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరుణ్‌రెడ్డి, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

## నాగ్సాన్‌పల్లిలో స్వయం పాలన దినోత్సవం

**పాపన్నపేట, మార్చి 9, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నాగ్సాన్పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పాలన దినోత్సవం జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. డీఇఓగా అశ్విత, ఎంఇఓగా తులసిప్రియ, ప్రధానోపాధ్యాయులుగా సాత్విక్, టీచర్లుగా ముష్కాన్, వైష్ణవి, లక్ష్మీ దుర్గ, రిషిత, శివాని, చిత్ర, సాత్విక్, షోహన్, నిశాంత్‌గౌడ్, మేనక, అటెండర్గా హరిప్రసాద్ బాధ్యతలు నిర్వర్తించారు. హెచ్ఎం కిషన్, టీచర్లు సుధారాణి, రాజు, శ్రవన్, పర్యవేక్షించారు. సర్పంచ్ దండెం చంద్రమ్మ, చైర్మన్ చంద్రమ్మ పాల్గొన్నారు.

### బుజ్రాన్‌పల్లి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో...

**పెద్దశంకరంపేట, మార్చి 9, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బుజ్రాన్‌పల్లి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈవోగా నరేష్, ఎంఈవోగా రాంచరణ్, ప్రధానోపాధ్యాయులుగా వరలక్ష్మి, ఉపాధ్యాయులుగా శ్రీ నిత్య, ధరణి, జగదీశ్వరి, పల్లవి, ప్రత్యూష, భార్గవి, వైష్ణవి, శివ, హరీష్, అవంతిక తదితరులు వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, ఉపాధ్యాయులు సత్య కుమార్, మోనికలు పర్యవేక్షి ంచారు.

## సమస్యలను పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలతో నిరసన


నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

**కొమురవెల్లి, మార్చి 9, ప్రభాతవార్త :** కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం, పట్టణ గురుకులాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న దాటవేత వైఖరికి నిరసనగా టిఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కెజిబివి,ఎస్ఎస్ఎ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి మండల కేంద్రంలో భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కేజీబీవీ, యుఆర్ఎస్ అండ్ ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న చాలీచాలని వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. గత ఏడాది 29 రోజులు సమ్మె చేసిన సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అంగీకరించిన అంశాలు నేటికి అమలుకు నోచుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. నిరసన కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సి.హెచ్.కనకయ్య, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణంరాజు, తిరుపతి, ఎస్ఓ పి.నీరజ, ఎస్ఎ శివరంజని,(ఎస్ఎస్ఎ)సిఆర్‌పి రుక్మిణి, సిఆర్‌టిలు అనుప, నవనీత, లావణ్య, కవిత, మౌనిక పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ


బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

**కొండపాక, మార్చి 9, ప్రభాతవార్త :** రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలు పల్లెలు అభివృద్ధి చెందుతాయని స్థానికసంస్థల ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి అన్నారు. సోమవారం లకుడారం మధిర కోలోనివంపు నుండి కాకుల గడ్డ బిడ్జి నిర్మాణానికి ఎఎంసి చైర్మన్ విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అకుల భద్రప్పతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోలోనివంపు నుండి కాకులగడ్డకు వెళ్లడానికి వర్షకాలం ప్రజలకు చాలా ఇబ్బంది కలిగేదన్నారు. ఇజిఎస్ నిధులతో బ్రిడ్జినిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో రెండు మధిర గ్రామాల ప్రజలకు ఇబ్బంది తొలగిపోయి సౌకర్యవంతంగా ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శిల్ప నర్సింలు, సర్పంచ్ తూం శ్రీకాంత్‌రెడ్డి, ఉప సర్పంచ్ యెల్లు శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు దేవి నర్సింలు, గట్టు చంద్రం, ప్రమీల శ్రీనివాస్, వంకని రాజు, కళా కర్ణాకర్, చిరబోయిన సాయిలు, లావణ్యభిక్షపతి, బచ్చలి అండాలు, బచ్చలి బాబు, ఎండి బాబు మీయా, కందూరి ఐలయ్య, భూపాల్, సంతోష్, రెడ్డబోయిన రవి, ఎండి మొహినోద్దిన్, అన్నెమైన నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాతోల్‌లో మల్లికార్జున స్వామి జాతర మహోత్సవం

**కంది, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బ్యాతోల్‌లో శ్రీకేతకి భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జాతర మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. జాతర ఉత్సవాలకు గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు మల్లేష్ యదవ్, కుమార్‌యాదవ్, రమేష్‌యాదవ్, శ్రీకాంత్ యాదవ్, నగేష్ యాదవ్, శ్రీకాంత్, మల్లేష్ తదితరులు పాల్గొని ఆలయానికి చేరుకున్న భక్తులకు దాతల సహకారంతో అన్నదాన వితరణ నిర్వహించారు.

## హుమ్నాపూర్‌లో క్షేత్ర దినోత్సవం

**న్యాల్‌కల్, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హుమ్నాపూర్‌లో సోమవారం వ్యవసాయ అధికారులు గ్రామానికి చెందిన మాలిపాటిల్ గుణవంత్ వ్యవసాయ క్షేత్రంలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జాతీయ ఆహార భద్రత పథకం కింద అందచేసిన శనగ పంట ఎన్‌బిఈజి-47 రకంపై రైతులకు వివరించారు. ఎన్‌బిఈజి-47 రకం శనగ పంటను సాగు చేసుకుంటే పంటకు ఎండు తెగులు సోకకుండా ఉంటుందని పంటను సాగుచేసిన రైతు గుణవంత్ పాటిల్ రైతులకు వివరించారు. పంట దిగుబడి ఎకరానికి 8 నుంచి 9 క్వింటాళ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. సబ్సిడీలో వచ్చిన వేప నూనె, మల్టీ కెలతో ప్రయోజనం అందుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ, ఏఈఓలు నగేష్, సాయి కిరణ్‌రెడ్డి, హుమ్నాపూర్ సర్పంచ్ చందు, రైతులు పాల్గొన్నారు.